క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రంజాన్ నెల జరుపుకోండి


మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : ముస్లింలు రంజాన్ నెలలో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి ప్రార్థనలు చేసుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ఆయన ఆదివారం నాయుడుపేటలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముస్లింలు రంజాన్ నెలవంక దర్శనం చేసుకుని 30 రోజులు కఠిన నియమాలతో రంజాన్ ఉపవాస దీక్షలు పాటిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉపవాస దీక్షలు పాటించే శక్తిని, ఆరోగ్యాన్ని అల్లా ప్రసాదించాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు

వాకాడు : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని వాకాడు ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం పంచాయతీ కార్మికులతో కలిసి వాకాడులో పారిశుద్ధ్య పనులు చేయించారు. ఆర్టీసీ బస్టాండ్, బజారు వీధి, దళితవాడ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, జంగిల్స్‌ను జేసీబీతో తొలగించి బ్లీచింగ్ చల్లించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. అనంతరం చెత్త సంపద కేంద్రంలోని వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె ఆదివారం దొరవారిసత్రం పీహెచ్‌సీ ఆవరణలో రక్త పరీక్షల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో వివిధ రకాల రక్త పరీక్షలు చేసేలా ఆధునిక వసతులతో కూడిన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలాగే డీవీ సత్రం పీహెచ్‌సీని ట్రామా కేర్ సెంటర్‌గా మార్చాలని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, కూటమి నేతలు ప్రవీణ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, శ్రీహరిరెడ్డి, రత్నయ్య, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి బ్యాంకు అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీకి 50 యూనిట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులు తీసుకురావాలని సూచించారు.

నిర్వహణ లోపంతో వెలగని సోలార్ లైట్లు


కొర్లగుంట ఎస్సీ కాలనీ రోడ్డులో వెలగని లైట్

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం వన్యప్రాణి విభాగం అధికారులు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో రూ.లక్షలు వెచ్చించి సోలార్ లైట్లు వేశారు. వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో సోలార్ ప్యానళ్లు, లైట్లు, బ్యాటరీలు మరమ్మతులకు గురై ఎందుకూ పనిరాకుండా పోయాయి. ప్రస్తుతం రోడ్డు వెంబడి ఐరన్ పోల్స్ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. డీవీ సత్రం నుంచి పక్షుల కేంద్రం ప్రధాన గేట్ల వరకు, నెల్లూరుపల్లి రోడ్డు నుంచి కొర్లగుంట ఎస్సీ కాలనీ వరకు ఒక్కో లైట్ సుమారు రూ.15 వేలు వెచ్చించి 20కి పైబడి సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పని చేయడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు రాత్రి సమయాల్లో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత వన్యప్రాణి విభాగం అధికారులు స్పందించి సోలార్ లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాయుడుపేట పట్టణ పరిధిలో స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు



ఇష్టారాజ్యంగా.. ఇసుక రవాణా

- రాళ్ల మయంగా మారుతున్న స్వర్ణముఖి నది
- బోర్లు అడుగంటిపోతాయని రైతులు, స్థానికుల ఆవేదన
- పట్టించుకోని అధికారులు

నాయుడుపేట టౌన్ : స్వర్ణముఖి నది నాయుడుపేట పట్టణంతోపాటు మండలంలోని భీమవరం, చిగురుపాడు, తిమ్మాజి కండ్రిగ, తుమ్మూరు,


ఇసుకతో రాళ్లమయంగా మారిన స్వర్ణముఖి నది

మర్లపల్లి, అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, కల్లిపేడు, పండ్లూరు, అన్నమేడు, కాలవగట్టు, వేమగుంటపాళెం తదితర గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీటి వనరుగా ఉంది. బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. అలాగే ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నదిలో నాణ్యమైన ఇసుక ఉంది. గతంలో అధికారుల అనుమతి మేరకే ట్రాక్టర్లతో ఇసుకను తరలించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కూటమి నేతల అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో డంపింగ్ యార్డులకు, పరిశ్రమలు, ప్రైవేట్ వెంచర్లకు, ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. నాయుడుపేట సమీప ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2000 వేలు పలుకుతుండగా ఇతర ప్రాంతాలకు రూ.2500లకు విక్రయిస్తున్నారు. చెన్నైకి తరలిస్తే టిప్పర్‌కు రూ.50 వేల వరకు పలుతోంది. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు.

కూటమి నేతల అండతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. దీంతో స్వర్ణముఖి నది రాళ్లమయంగా మారుతోంది. దీంతో నాయుడుపేటతోపాటు పలు గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇసుక రవాణా విషయం తెలిసినా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఇసుకాసురులను కట్టడి చేయాలని కోరుతున్నారు.

పగలే అక్రమ రవాణా

ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తరలించే వారి కోసం మున్సిపల్ అధికారులు స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద గేటు ఏర్పాటుచేశారు. ఎడ్ల బండ్ల వారు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు ఇసుక తోలుకునేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. కొద్ది రోజులుగా కూటమి నేతల హుంకరింపుతో కాజ్‌వే వద్ద గేట్లు తెరిచే ఉంటున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ దందా నిరాటకంగా సాగుతోంది. స్వర్ణముఖి నదిలో మున్సిపాలిటీకి చెందిన తాగునీటి పథకాలకు బోర్లు, మోటార్లు ఉన్నా పట్టించుకోవడం లేదు. వాటి సమీపంలోనే పెద్ద పెద్ద గుంతలు తవ్వి ఇసుక తోడేస్తున్నారు. ఇలా అయితే వేసవిలో బోర్లు ఎండిపోయి తాగునీటి సమస్య నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు. నెలవారీ మామూళ్లు అందుతుండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలించకుండా చూడాలని కోరుతున్నారు.


స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద గేటు ఎత్తేసి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలువాయి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.భవాని తెలిపారు. ఇందులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అంకాళ పరమేశ్వరి

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు : పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు జోనల్ సెక్రటరీ ధనుంజయరెడ్డి ఆకాంక్షించారు. గూడూరు పట్టణంలోని బనిగేసాహెబ్ పేటలోని జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చి ఐదేళ్లు కలిసి చదువుకుంటున్న విద్యార్థులు పరీక్షల్లో ఒకరికొకరు తోడుగా ఉండాలన్నారు. తమలోని భయాన్ని విడనాడి సందేహాలను నివృత్తి చేసుకుంటూ గ్రూప్‌గా చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు సనత్‌కుమార్‌రెడ్డి, శేగ శ్రీనివాసులు, సిద్దారెడ్డి, హరినాథ్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం


విద్యార్థులకు చెక్కులిస్తున్న సంస్థ ప్రతినిధులు

చిల్లకూరు : గూడూరుకు చెందిన ఇద్దరు పేద విద్యార్థుల చదువుల కోసం రూ.20 వేలను ఆదివారం అమెరికాలోని ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు సునీతా సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు ద్వారా అందజేశారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు పద్మావతి మాట్లాడుతూ పేద విద్యార్థులైన మర్రి సాయిసురేఖ, రావూరి మాధురి బీటెక్ చదువుతున్నారని తెలిపారు. వారి చదువులకు తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో అమెరికాలోని అసోసియేషన్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులు హరిక్రిష్ణకు తెలిపామన్నారు. ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రూ.20 వేలు పంపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు సారంగం సులక్ష్మీ, సభ్యులు సువర్ణలక్ష్మీ, ఉమాదేవి, సరోజనమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఆవుల అదృశ్యంపై రైతుల గగ్గోలు

చిల్లకూరు : గూడూరు శివారు ప్రాంతంలో కొంత కాలంగా ఆవులు కనిపించకుండా పోతున్నాయని పాడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. గూడూరు శివారు ప్రాంతాలైన గాంధీనగర్, పారిచెర్ల, తిలక్‌నగర్, ఇందిరానగర్‌లో కొంతమంది పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా మేతకు వెళ్లిన ఆవులు కనిపించకుండా పోతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొంత మంది ఆవులను నాలుగు చక్రాల వాహనాల్లో తరలించుకుపోతున్నట్టు గ్రామాల వాసులు చెబుతున్నారని పేర్కొంటున్నారు. పోలీసులు సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి ఆవులను తరలించే వాహనాలను గుర్తించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రంజాన్ ఉపవాసాలు ప్రారంభం


నాయుడుపేట జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

నాయుడుపేట టౌన్ : రంజాన్ మాస ఉపవాస దీక్షలను మొదటి రోజు ఆదివారం ముస్లింలు ప్రారంభించారు. నాయుడుపేటలోని జామియా, దర్గావీధిలోని అమీర్‌షావలి, పాత బస్టాండు వద్ద వున్న నూర్, అమరాగార్డెన్ వీధిలోని మక్కా మసీదులతోపాటు ఇతర కాలనీల్లో ఉన్న మసీదులకు ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉపవాసం వుండి నమాజు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ సమయానికి మసీదు వద్దకు చేరుకుని పలువురు తీసుకువచ్చిన పండ్లు, ఫలహారాలు, మసీదు నిర్వాహకులు ఏర్పా టు చేసిన ఆష్‌లను సేవించి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : నెలవంక కనిపించడంతో ముస్లింలు ఆదివారం నుంచి ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. గూడూరు పెద్ద మసీదు వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి నమాజు చేశారు.

కండలేరులో 51.647 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 51.647 టీఎంసీల నీరు నిల్వఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లి సచివాలయంలో సోమవారం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్, ఆత్మకూరు ఆర్డీవో అధ్యక్షతన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు తెలిపారు. గత రీసర్వేలో మాదన్నగారిపల్లిలో దరఖాస్తు భూములను ప్రభుత్వ భూములుగా చూపడం, పట్టా భూముల విస్తీర్ణంలో ఏర్పడిన వ్యత్యాసాలపై వినతులు స్వీకరిస్తారని తెలిపారు. రైతులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

8,9 తేదీల్లో జాతీయ స్థాయి జర్నలిస్టుల సదస్సు

వాకాడు : ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈ నెల 8, 9వ తేదీల్లో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టుల సదస్సు నిర్వహించనున్నట్టు జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు పాశం ఏడుకొండలు తెలిపారు. ఆయన ఆదివారం వాకాడులో విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రముఖ జర్నలిస్టులు పాల్గొని సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అశ్వ, సింహ వాహనాలపై ఆది దంపతులు



శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అశ్వవాహనం, అమ్మవారు సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. కైలాసగిరి ప్రదక్షిణ చేసి సకల దేవతాగణాలకు వీడ్కోలు పలికిన ఆదిదంపతులు రాత్రి ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం అశ్వ, సింహ వాహనంపై పురవిహారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వాకాడు : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఏవో దీప తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ తరుణంలో రైతులు తమ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులకు అంగీకారాన్ని తెలపాలని సూచించారు. తర్వాత ధాన్యం నాణ్యతను బట్టి తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న వాటికి క్వింటాల్‌కు రూ.2,325 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు వెంకటగిరిలో జాబ్‌మేళా

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని శ్రీనివాసన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఇన్‌చార్జి జైసింగ్ తెలిపారు. ఇందులో చెన్నైకి చెందిన టీవీఎస్ సుందరం క్లేటన్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లొమాతో పాటు ఏదైనా డిగ్రీ పూర్తిచేసి 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు యువతీ, యువకులు హాజరుకావొచ్చని తెలిపారు. తమ వెంట సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

ఆర్టీసీ నిర్లక్ష్యంతో ప్రయాణికులకు తిప్పలు


షెల్టర్ లేకపోవడంతో ఎండలో రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

కోట : బస్సు ప్రయాణమే సురక్షితమంటూ చెప్పే ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన చోట బస్‌షెల్టర్లు నిర్మించడం లేదు. కోట క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రతిరోజూ కోట మండలంలోని పలు గ్రామాలతో పాటు వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి ప్రయాణికులు ఇక్కడ దిగి బస్సుల కోసం నిరీక్షిస్తూ ఉంటారు. ఇక్కడ బస్‌షెల్టర్ లేక పోవడంతో ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులో భాగంగా రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను రెండేళ్ల క్రితం కూల్చేశారు. తర్వాత కొత్త షెల్టర్ నిర్మించలేదు. ప్రయాణికులు రోడ్డు డివైడర్ దిమ్మెలపైన కూర్చుని బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కోట క్రాస్ రోడ్డు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్చుసా లేఅవుట్ ప్రారంభం


లేఅవుట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటుచేసిన వర్చుసా లేఅవుట్‌ను ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, ఐశ్వర్య రాజేష్, కమెడియన్లు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్ యజమాని వెంకటేశ్వర్లు, జీఎం శివాజీ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే అందరికీ అందుబాటులో లేఅవుట్‌ను తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. బస్సు సౌకర్యం, 300 మీటర్ల దూరంలో రైలు సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. లేఅవుట్‌లో విశాలమైన రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు

దొరవారిసత్రం : దొరవారిసత్రం, నెల్లూరుపల్లి గ్రామాల్లో వున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీటిని కొన్నేళ్ల క్రితమే వినియోగించకుండా వదిలేశారు. ట్యాంకు, పిల్లరు దెబ్బతిని పెచ్చులు ఊడిపోతున్నాయి. ట్యాంకుల సమీపంలో నివాసం ఉంటున్న వారు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కల్లూరుకండ్రి గ్రామానికి తాగునీటిని అందించే ఓవర్ హెడ్ ట్యాంకు పైపుల నుంచి నీరు వృథాగా పోతోంది. తీగ చెట్లు అల్లుకోవడంతో దారుణంగా తయారైంది.


నెల్లూరుపల్లిలో వున్న వాటర్ ట్యాంకు


కల్లూరుకండ్రిగలోని ఓవర్‌హెడ్ ట్యాంకు దుస్థితి

ఉభయదాతలకు అవమానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉభయదాతలకు అవమానం సర్వసాధారణం అయిపోయింది. ఎంతో భక్తితో ఆలయ అభివృద్ధికి దానం చేసేవారిని, తరతరాలుగా ఉభయదాతలుగా ఉండే వారికి తరచూ అవమానాలు జరుగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఉభయదారుడైన బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆలయంలో గిరిప్రదక్షిణకు ఉభయదాతలుగా వారి కుటుంబసభ్యులు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా అలంకార మండపంలో జరిగే పూజాది కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే కుటుంబసభ్యులు రావడంతో అలంకార మండపలలో కొబ్బరికాయను కొట్టించారు. అయితే ఉభయదాత, మాజీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులు కొబ్బరికాయ కొట్టే అవకాశం కూడా ఇవ్వకుండా ఆలయ అధికారులు అవమానించారు. పోలీసులు అత్యుత్సాహం చూపించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిమెంట్ రోడ్డు వేయాలని నిరసన

ఓజిలి: మండలంలోని పెదపరియ ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆదివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 81-1లో ఉన్న 14.84 ఎకరాల గ్రామకంఠం భూమిలో ఎస్సీ కాలనీ ఏర్పడిందన్నారు. 40 ఏళ్లుగా గుడి పక్కన ఉన్న రోడ్డు నుంచే తాము రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. ఈ రోడ్డులో సీసీ రోడ్డు వేయడానికి గతంలో సర్పంచ్ గోవిందు సుధ ఎమ్మెల్యే సంజీవయ్య సహకారంతో రూ.10 లక్షలు మంజూరు చేయించారని వెల్లడించారు. కాలనీకి చెందిన ఒక మహిళ రోడ్డు ఏర్పాటును అడ్డుకుందని వాపోయారు. నాటి నుంచి రోడ్డు వేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో గుడి పక్కన ఉన్న రోడ్డును కాదని రోడ్డు పక్కనే సిమెంట్ రోడ్డు వేసేందుకు టీడీపీ నాయకులు సిమెంట్, కంకర, ఇసుక సిద్ధం చేశారని తెలిపారు. అధికారులు స్పందించి గుడి పక్కనే సిమెంట్ రోడ్డు వేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేవీ రమణయ్య, తాళ్లూరు కుమార్, ఎస్ శ్రీనివాసులు, జీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెదపరియ కాలనీ వాసులు


సిమెంట్ రోడ్డు వేయాల్సిన రోడ్డు ఇదే